క్లుప్తంగా

భూ కబ్జాపై ఆర్డీవో విచారణ



దాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో హరిసింగ్

జమ్మికుంట: పట్టణంలో షాదీఖాన కోసం 629 సర్వే నంబర్‌లో ప్రభుత్వం భూమి కేటాయించగా కొందరు కబ్జా చేశారని మైనార్టీలు ఆందోళన వ్యక్త చేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ విచారణ చేపట్టారు. మైనార్టీలకు మంజూరు చేసిన డాక్యుమెంట్లను పరిశీలించారు. మైనార్టీలకు భూమి అప్పగించాలని ఆర్‌ఐ తిరుపతికి ఆదేశాలు ఇచ్చారు. ఆర్డీవో వెంట ఎస్‌ఐ యూనీస్ అహ్మద్ అలీ, నాయకులు మహ్మద్ సజ్జు, మహ్మద్ జానీ, మునీర్, ఖదీర్,రెహమాన్, నిహాల్, ఫయాజ్, సమీర్, సుఫియా, సర్వర్‌పాషా, జాకీర్, బాబా ఉన్నారు.

అభివృద్ధిపై చర్చకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేడిపల్లి

గంగాధర: చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే రవిశంకర్ బహిరంగ చర్చకు రావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు వచ్చే నిధులను తాను తీసుకువచ్చానని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే హోదాలో నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి ఎందరికి ఇచ్చారని ప్రశ్నించారు. తొమ్మిది మండలాలకు కేంద్రమైన గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కాంగ్రెస్ హయాంలో స్థలం కేటాయించినా కళాశాల మంజూరు చేయించలేదన్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామం నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాని ఏళ్లగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొండగట్టుకు వందకోట్లు రాకముందే వచ్చినట్లు చెప్పుకోవడం కాదు తెచ్చిన తరువాత మాట్లాడాలన్నారు. నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, దుబ్బాసి బుచ్చయ్య, మహేశ్వర్ రెడ్డి,బూర్గు గంగయ్య, రాచమల్ల భాస్కర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, జారతి మోహన్,శంకర్, నాగేందర్‌రెడ్డి, తిరుపతి, మహేశ్,మంత్రి మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పట్టుదలతో పని చేయాలని పార్టీ అసెంబ్లీ పాలక్ జెఎస్ వెంకట్ పిలుపునిచ్చారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి బూత్‌కమిటీల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బూత్ కమిటీ సభ్యులకు సరళ్ యాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశానికి నాయకులు రాజేశ్, పెరుక శ్రావణ్‌కుమార్, బి.లక్ష్మినారాయణ, లింగంపల్లి శంకర్,ప్రభాకర్‌యాదవ్, ఎస్ కృష్ణారెడ్డి, సత్యనారాయణ, వైద రామానుజం, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి బూత్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి



మాట్లాడుతున్న అంజన్‌కుమార్

రామడుగు: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ చైర్మన్ అంజనేయులుగౌడ్, మండల శాఖ అధ్యక్షులు తిరుపతి, రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ రాజమల్లయ్య, నాయకులు రమేష్,హరీష్, కాడె శంకర్, బాలాగౌడ్, నర్సింగం, శ్రీనివాస్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణ, రాయుడులతో పలువురు పాల్గొన్నారు.

వెరైటీ టేస్టే

- నాన్‌వెజ్ ప్రియులకు 'కుండ' చికెన్ బిర్యానీ
- కుండ పరిమాణం బట్టి ధర
- ఫ్యామిలీ, యువతను ఆకర్షిస్తున్న జమ్మికుంటలోని కేఎస్ బిర్యానీ హౌస్

సండే స్పెషల్


జమ్మికుంట: నాణ్యమైన, రుచికర భోజనాన్ని అందరూ ఇష్టపడతారనే విషయంలో సందేహం లేదు. సుచి, వంటకం తీరులో మార్పులు వచ్చాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ రుచికరమైన భోజనం కోరుకుంటున్నారు. దావత్‌లకు భోజన ప్రియులు వెరైటీ వైపు మొగ్గు చూపుతున్నారు. జమ్మికుంట పట్టణంలో కేఎస్ బిర్యానీ హౌస్‌లో మట్టికుండలో చికెన్ బిర్యానీ చాలా రుచికరంగా తయారు చేస్తూ భోజన ప్రియులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కసారి తిన్నారంటే మర్చిపోలేరు. పట్టణంతోపాటు ఇతర మండలాలకు చెందినవారిని బిర్యానీ ఆకట్టుకుంటోంది. ఆర్డర్‌పై కుండ బిర్యానీ వండించుకోవడం, యువత దావత్‌లకు పార్సిల్‌గా తీసుకెళ్లడాని ఆసక్తి చూపుతున్నారు.

వంట పాత్రల్లోనే ప్రత్యేకత

ఇదివరకు మట్టి పాత్రల్లో అన్నం, కూర వండుకొని తినేవారు. దీంతో ఆరోగ్యం, పోషకాలు వంటలో మిళితమై ఉంటాయని పాత కాలం వారు, అనుభవజ్ఞులు చెబుతుంటారు. నీరు తాగడం, వంట మట్టి పాత్రల్లో చేయాలని పలు సందర్భాల్లో మట్టి పాత్రలు వినియోగించాలని పలువురు సూచిస్తుంటారు.

నెయ్యితో ప్రత్యేకంగా తయారీ

మట్టికుండలో నూనె వాడకుండా నెయ్యి మాత్రమే వాడటం ప్రత్యేకత. కుండ, నెయ్యి, చికెన్, బాస్మతి రైస్, కాజుతోపాటు ఇంట్లో తయారు చేసిన మసాలాలతో నైపుణ్యం ఉన్న వంట మాస్టార్‌తో కుండ బిర్యానీ వండిస్తున్నారు. నెయ్యి ఆరోగ్యానికి మంచిదని చెపుతున్నారు.



కుండ చికెన్ బిర్యానీ వివిధ పరిమాణాలు

పరిమాణం బట్టి ధరలు

కుండ పరిమాణం బట్టి ధరలు ఉన్నాయి. కుండ చికెన్ బిర్యానీ ఒకరికి రూ. 200, ఇద్దరికి రూ.330, ముగ్గురికి రూ.410, నలుగురికి రూ.660 లభిస్తుంది. జమ్మికుంట పట్టణం, ఇతర మండలాల వారు కుండ చికెన్ బిర్యానీని ఇష్టం లాగేస్తున్నారు. అందరికి అందుబాటులో ధరలు ఉండటం, నలభై నిమిషాల ముందు ఆర్డర్ చేస్తే వండి సిద్ధంగా ఉంచుతారు.



కుండ చికెన్ బిర్యానీ తయారు చేస్తున్న మాస్టర్

పార్సిల్ తెప్పించుకుంటాం



పట్టణానికి పనిమీద వస్తే మధ్యాహ్నం సమయంలో బిర్యానీ హౌస్‌కు వెళ్తుంటా. వెరైటీగా కుండ బిర్యానీ చేస్తున్నారని తెలిసి, ఆర్డర్ ఇచ్చాం. భోజనం చాలా రుచిగా ఉంటుంది. దావత్‌లకు స్నేహితులతో కలిసి పార్సిల్ తెప్పించుకుంటాం.

– కడిపికొండ కొండాల్‌రెడ్డి, అంక్షాపూర్, జమ్మికుంట

టేస్టీగా ఉంటుంది



కుండ చికెన్ బిర్యానీ చాలా టేస్టీగా ఉంటుంది. చాలా సార్లు ఫ్రెండ్స్‌తో కలిసి భోజనం చేశాం. జమ్మికుంటకు కుండ బిర్యానీ తినాల్సిందే. ప్రత్యేకమైన రుచితో కుండ బిర్యానీ కేఎస్ బిర్యానీ హౌస్‌లోనే దొరుకుతుంది.

– రఘునాథ్‌రెడ్డి, కేశవపట్నం

నాన్‌వెజ్ వెరైటీగా అందించాలని



పట్టణంలో చాలా బిర్యాని పాయింట్లు ఉన్నా వెరైటీగా, కొత్త వంటకాలను భోజన ప్రియులకు అందించాలని భోజన ప్రియులకు కుండ చికెన్ బిర్యానీ అందిస్తున్నాం. జమ్మికుంట, హుజురాబాద్, వీణవంక, కేశపట్నం, ఇల్లందకుంట మండలాల నుంచి భోజనం చేసేందుకు వస్తుండటంతో గిరాకీ బాగుంది.

– చిన్నాల శ్రీకాంత్, యాజమాని, కేఎస్ బిర్యానీ హౌస్

సమాచారం

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి మరో అవకాశం

చొప్పదండి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరడానికి జనవరి 13 వరకు అవకాశం ఉందని చొప్పదండిలోని ఓపెన్ స్కూల్ సెంటర్ నిర్వాహకుడు భిక్షు విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు, వయోజనులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 9 నుంచి 13 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆసక్తి గలవారు నమోదు చేసుకోవాలని కోరారు.

కేశవపట్నం ఏఎస్సైగా వెంకటేశ్వర్‌రెడ్డి



శంకరపట్నం: కేశవపట్నం ఏఎస్సైగా శనివారం నిమ్మ వెంకటేశ్వర్‌రెడ్డి విధుల్లో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ



శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

గంగాధర: గంగాధర మండల తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అనంతరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్‌ను కలెక్టరేట్‌కు సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది శుభాకాంక్షలు వ్యక్తం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శనివారం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి, పంచముఖ అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు అభిషేకం, అలంకరణ, పట్నాలు వేసి బోనాలు సమర్పించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- అభివృద్ధిలో గన్నేరువరంను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం: అన్నిరంగాల్లో గన్నేరువరం మండలాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గుండ్లపల్లి స్టేజీ నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 71 కోట్ల నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు చేపట్టిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. నిధుల కోసం అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని, స్వార్థ రాజకీయాల కోసం యువత భవిష్యత్‌ను విచ్ఛిన్నం చేయొద్దని ఆయా పార్టీలకు సూచించారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ దేనని, రైతులు, ప్రజలు బీఆర్ఎస్‌తో ఉన్నారని దీనికి సిరిసిల్లా జిల్లా సెస్ ఎన్నికల ఫలితాలు నిదర్శమన్నారు. మండలకేంద్రంలో పది లక్షలతో ఫిష్ మార్కెట్ నిర్మాణం చేపడతామని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం వర్తింపజేస్తామన్నారు. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అభివృద్ధి పనుల కోసం ఏడాదికి నియోజకవర్గానికి రూ.2 కోట్ల నిధులు తీసుకోచ్చారని, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఎన్ని నిధులు తెచ్చారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చొక్కారావుపల్లె వద్ద మానేరువాగుపె బ్రిడ్జి నిర్మాణం హామీ ఏమైందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో నాయకులు ఘనంగా సత్కారించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల కోఆర్డినేటర్లు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకన్న, వెలమ సంఘం అధ్యక్షుడు మన్మోహన్‌రావు, సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అంజనేయులు, వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రభాకర్, ఆయా సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పంటల పరిశీలన

రామడుగు: వరిలో కాండం తొలిచే పురుగు ఆశించడం జరుగుతోందని, రైతులు తక్షణం నివారణ చర్యలు తీసుకోవాలని చింతకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి యాస్మిన్ సూచించారు. మండలంలోని దేశరాజ్‌పల్లి, ఔదర్‌పల్లి గ్రామాలలో శనివారం వరి పొలాలను పరిశీలించారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఏఈవో రమేశ్ రైతులు పాల్గొన్నారు.

✦ సంక్షేమ పథకాలు ఆదర్శం

వీణవంక: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వీణవంక ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, సీఎం కేసీఆర్ చొరవతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనం వంటి పనులు జరిగాయని తెలిపారు. బీఆర్ఎస్‌పై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాడని కొనియాడారు.

✦ పాఠశాలకు బోర్డుల అందజేత

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నేమ్ బోర్డులు అందజేశారు. లయన్ డిస్ట్రిక్ లియో కోఆర్డినేటర్లు స్పందించి అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో బావండ్ల శంకర్, పాలేపు సురేశ్, ముంజం సంపత్, సమ్మయ్యల సహకారంతో బోర్డులు సిద్ధం చేశారు. వాటిని లయన్ బూర శ్రీనివాస్ సమక్షంలో అందజేశారు.

✦ పీఎంశ్రీ పథకానికి ఎంపిక

ఇల్లందకుంట: మండలంలోని ఇల్లందకుంట హైస్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపికైందని ఇన్‌చార్జి మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాఠశాలను ఎంఈవో, క్లస్టర్ ఇన్‌చార్జి పద్మతో కలిసి పరిశీలించారు. డిజిటల్ ఎడ్యూకేషన్, సోలార్, ఎల్ఈడీ లైటింగ్ వినియోగించే శక్తి సామర్థ్యాలు, సేంద్రీయ వ్యవసాయంతో కూడిన పోషకాహార తోటలు, వ్యర్థాల నిర్వహణ మొదలైన పర్యావరణ అనుకూల అంశాలను కలుపుకొని గ్రీన్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు.

✦ విచారణ వేగవంతం చేయాలి

హుజూరాబాద్‌రూరల్: పోలీసులు విచారణలో సమయంలో ఆధారాలను పక్కాగా సేకరించి, విచారణ వేగవంతం చేయాలని హుజూరాబాద్ ఫస్ట్ అండ్ సెకండ్ అడిషనల్ కోర్టుల అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గాయత్రి, రామ ఉపేందర్, అసిస్టెంట్ సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–2 శరత్ సూచించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వుల మేరకు శనివారం డివిజన్ పోలీసులతో సమన్వయ సమావేశం పట్టణంలో జరిగింది. ఫిర్యాదు చేసిన బాధులకు సత్వర న్యాయం, కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై చర్చించారు.

✦ శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు

తిమ్మాపూర్: అయ్యప్ప మండల దీక్ష స్వీకరించిన స్వాములు శనివారం శబరిమలకు బయల్దేరి వెళ్లారు. మకర జ్యోతి దర్శనం కోసం నుస్తులాపూర్ నుంచి ప్రత్యేక బస్సులో స్వాములు బయల్దేరారు. సర్పంచ్ రావుల రమేశ్ యాత్రనుప్రారంభించారు. ఎల్ఎండీ కాలనీ తాపాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి శబరిమలకు అయ్యప్పస్వాములు ఇరుముడులతో పయనమయ్యారు.

✦ కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంపద

తిమ్మాపూర్: కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంపద ఉత్పత్తి అవుతుందని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.నరేందర్ తెలిపారు. మండలంలోని మహాత్మనగర్, బాలయ్యపల్లి జీపీల పరిధిలో పాడి పశువుల పునరుత్పత్తి, గర్భకోశ వ్యాధుల నివారణకు చికిత్స, మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహాత్మానగర్‌లో ఎంపీపీ వనిత, సర్పంచ్ శ్రీవాణి, బాలయ్యపల్లిలో సర్పంచ్ గణమ్మ, ఎంపీటీసీ పద్మ శిబిరాలను ప్రారంభించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. నరేందర్, సహాయ సంచాలకులు డాక్టర్ జయరాములు మాట్లాడుతూ రైతులు వ్యసాయంతోపాటు పశుపోషణపై దృష్టిపెట్టాలని, పశువులు వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పశువులకు చికిత్స చేసి మందులు అందించారు.

✦ రక్తదానం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన యువకుడు కొలిపాక కమలాకర్ శనివారం 13వ సారి రక్తదానం చేశారు. గంగాధర మండలం గట్టుబుత్కూర్ గ్రామానికి చెందిన బొల్లబత్తిని అలేఖ్యకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు. కాగా రక్తదానం చేసిన కమలాకర్‌ను గోపాల్‌రావుపేట గ్రామస్తులు, పలువురు యువకులు అభినందించారు.

యువకుల పోరాటంతోనే నిధుల కేటాయింపు



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: యువకుల పోరాటంతోనే గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ జీవో జారీ చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని హన్మాజిపల్లెలో మాట్లాడారు. ఆరు నెలల్లో పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మైలారం నుంచి గన్నేరువరం రహదారికి వచ్చిన నిధుల పట్ల పాలాభిషేకాలు చేశారని కానీ పనులు జాడేలేదని విమర్శించారు. పాటలు పాడటానికి బస్సుల్లో వెళ్లిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కి నియోజకవర్గంలో ఫామ్‌హౌజ్, వందల ఎకరాల భూమి, నివాస గృహాలు ఎక్కడివని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, నాయకులు మల్లేశం, ఉపేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, అనిల్, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనిల్, ప్రశాంత్, తిరుపతి, సంజీవ్, శంకరయ్య, చందర్, ఎల్లారెడ్డి, జయప్రకాశ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



జమ్మికుంట: ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేక విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని, వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవాల నరహరి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర పాఠశాలలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం సదానందం, డీటీ ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు ఐలయ్య, వెంకటేశ్వర్లు, రాంచందర్‌రావు, రాజు, సదానందం, సురేష్, సునీత, శైలజ, లక్ష్మి, మాధవిరాణి టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతి అందిస్తున్న ఎంఈవో నర్సింహారెడ్డి



బహుమతులందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

శంకరపట్నం: ఇంగ్లిష్ పాఠ్యాంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో కేవీ. నర్సింహారెడ్డి బహుమతులు అందజేశారు. కేశవపట్నం మోడల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు స్పెల్‌విజార్డ్, స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. స్టోరీ టెల్లింగ్‌లో కన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సహస్ర ప్రథమ, మోడల్ స్కూల్ విద్యార్థి మోక్షిత్ ద్వితీయ, మెట్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీజ తృతీయ, స్పెల్ విజార్డ్‌లో మోడల్‌స్కూల్ విద్యార్థిని అభినేత్రి ప్రథమ, జ్యోతి ద్వితీయ, కన్నాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హస్యశ్రీ తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి ఇంగ్లిష్ నైపుణ్య పోటీలను నిర్వహించారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంగ్లిష్ భాషా చాలా ముఖ్యమైందని ప్రపంచంలో ఎక్కడైనా చదువుకోవడం, జీవించాలన్నా ఇంగ్లిష్ అవసరమన్నారు. అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మండల నిర్వాహక కన్వీనర్ వేణు, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, కోకన్వీనర్ సత్యనారాయణ, కిషన్, పద్మ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని వెన్కెపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టాలెంట్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారు. పోటీలతో విద్యార్థులు సృజనాత్మకత, ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తారని వెన్కెపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖైరున్నీసాబేగం అన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎల్టా బాధ్యులు వి. ప్రవీణ్‌కుమార్, పలు పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో ఉపాధ్యాయుల నిరసన




నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన 317 జీవో వల్ల ఎందరో ఉద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని, జీవో వల్ల నష్టపోయిన ఉద్యోగులకు సత్వర న్యాయం చేయాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా నాయకుడు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నూతన జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపులో భాగంగా అక్రమంగా తీసుకొచ్చిన జీవోకు ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం రాత్రి ఉపాధ్యాయులు ప్లకార్డుతో నిరసన తెలిపారు. భార్యభర్తలు ఒకే చోట ఉద్యోగం చేయాలి, వాళ్లను ఒకే దగ్గర చేరుస్తామని సీఎం కేసీఆర్ అన్నారని, దానికి భిన్నంగా ఇప్పటికీ పదమూడు జిల్లాలో స్పౌజ్ బదిలీలను బ్లాక్ లిస్టులో పెట్టడం ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆరోపించారు. పదమూడు జిల్లాలను బ్లాక్ లిస్టు నుంచి తొలిగించాలని డిమాండ్ చేవారు. కొందరు అక్రమంగా బదిలీలు చేసుకున్నారని, వారి బదిలీలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృతకిషోర్‌కుమార్,ఏబూషి శ్రీనివాస్, మర్రి అవినాష్, ముస్తాక్, రమాదేవి, వెంకటస్వామి, సురేష్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన

తిమ్మాపూర్: వేరుశనగ సాగుపై మండలంలోని నుస్తులపూర్ రైతు వేదికలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మక్తపల్లె రైతులకు కోసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త శ్రీనివాస్ యసంగి వరి సాగు యాజమాన్య పద్ధతులు, ట్రైకోడెర్మావిరిడే వాడే విధానం వివరించారు. మండల వ్యవసాయ అధికారి సురేందర్ మాట్లాడుతూ రైతులు పీఎస్‌బీ వాడి నేలలో ఉన్న భాస్వరంను వినియోగించుకోవాలని తెలిపారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవ్వంపెల్లి పద్మ, ఉప సర్పంచ్ పారిపెల్లి రాజిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి స్వామి, రైతులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



జమ్మికుంట: ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆర్. ఈశ్వరయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్‌సీసీ కెడెట్లు పునీత్ సాగర్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నాయిని చెరువులో ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, వ్యర్థ పదార్థాలను తొలిగించారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, నదులు, చెరువు, కాలువలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్‌సీసీ కెడెట్లకు సూచించారు.